# దోపిడీ

-సుంకరి రాంప్రసాద్

'రోజా, సరోజా, నీరజా, వారిజా!'

. గొంతెత్తి కాంతమ్మ పిలిచేసరికి ఆ నలుగురు యువతులూ ఆ గదిలోనికి వచ్చి నిలుచున్నారు.

'వీరు కుమార్ గారని, నాచీ ఫైనాన్సింగ్ కంపెనీ ఏజెంట్'. ఆ ఆదిలోని సోఫాలో ఠీవిగా కూర్చున్న ఎత్తుగా, బలంగా ఉన్న యువకుని వంక చూపుతూ అంది కాంతమ్మ.

వారికి ఒక్క-క్షణం అర్థం కాలేదు. ఎప్పుడూ వచ్చే విటులకు తమ పేర్లు చెప్పి ఎవరు కావాలో ఎంచుకోమని చెప్పడం తప్ప, ఆ విటుల పేర్లూ, గోత్రాలూ చెప్పి పరిచయం చేయదు కాంతమ్మ. 'మరి, ఈసారి ఎందుకిలా!' ఆశ్చర్యంగా ఉంది వారికి.

'నాచీ ఫైనాన్సింగ్ కంపెనీ' ఎక్కడో విన్నట్టుందే ఈ పేరు అనుకుంది సరోజ. రెండు నిముషాల తర్వాత గుర్తుకు వచ్చిందామెకు. ఆ ముందు రోజు పేపర్లో చదివిందామె. 'వారాంగనలకు ఋణ సహాయం' అన్న హెడ్డింగ్‌తో ప్రచురింపబడ్డ ఆ వార్త ఆమె కళ్ళ ముందు కదలాడింది.

'వేశ్యా వృత్తిలో జీవిస్తున్న యువతులను ఆదుకొని, వారికి ఋణ సదుపాయం కల్పించి, స్వయం ఉపాధి పథకాలద్వారా వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకు రావడానికి నాచీ ఫైనాన్సింగ్ కంపెనీ నడుం కట్టింది.'

'అంతే నిన్న పేపర్లో...' సందిగ్ధంగా కాంతమ్మ వంక చూస్తూ అడిగింది సరోజ. అవునన్నట్టు తలాడించిందామె.

'వారే! ముందు మన కంపెనీకే వచ్చారు' గర్వంగా అందామె. ఆ వాడలో పరువంలో పిట పిటలాడే పసందైన పిల్లలకు కాంతమ్మ కంపెనీ పెట్టింది పేరు.

అతడు మెల్లగా లేచి నిలబడ్డాడు. ఆ యువతులను సమీపించాడు. ఒక్కొక్కరిని పట్టి, పట్టి చూశాడు. అతని చూపులు సరోజపై నిలిచిపోయాయి. ఒక్కసారి ఓరగా కాంతమ్మ వంక చూశాడు.

చిన్నగా నవ్విందామె. 'సరోజా! బాబు గారిని నీ గదిలోకి తీసుకు వెళ్ళు' అందామె.

'ఇక్కడ కాదు. మా ఆఫీసుకు పంపండి' అన్నాడతడు.

'ఆఫీసుకా..?'

'మరి మా మేనేజరూ, అకౌంటెంట్‌లను కూడా సంతోష పెట్టాలి కదా!'

ఒక్క క్షణం ఆలోచనల్లో పడింది కాంతమ్మ. కాని, కళ్ళ ముందు వారివ్వబోయే కరెన్సీ కట్టలు కన్పించగానే సరేనన్నట్టు తలాడించింది.

సరోజను తీసుకొని బయటకు నడిచాడతడు.

ముగ్గురు మగాళ్ళ మధ్య రాత్రంతా ఆమె ఎంతగా నలిగిపోతుందో, కరిగిపోతుందో బలి పశువులా వెళ్తున్న సరోజకు, చూస్తున్న మిగిలిన యువతులకు అందరికీ తెలుసు.

కాని, ఏం చేస్తారు? బ్రతుకు అంగడిలో అమ్ముకోవడానికి మానం తప్ప ఏమీలేని వారాంగనలు వారు.

ఆ మరుసటి రోజు రోజా, ఆపై రోజు నీరజ ఇలా వారం రోజులు రోజుకొకరుగా కుమార్‌తో వాళ్ళ ఆఫీసుకు వెళ్ళారు.

OOO

ఆ రోజు...

ఋణాలు ఇస్తామని చెప్పిన రోజు. ఉదయం పది గంటలయ్యే సరికి తన దగ్గరున్న అమ్మాయిలనందరినీ తీసుకొని ఆత్రంగా ఆ ఆఫీసుకు వెళ్ళింది కాంతమ్మ.

కాని, ఆమెను వెక్కిరిస్తూ ఆఫీసు తలుపులకు పెద్ద తాళం కప్ప వ్రేలాడుతూంది. ఆఫీసును ఖాళీ చేసి వాళ్ళు వెళ్ళిపోయారన్న చేదు నిజాన్ని తట్టుకోలేక కుప్పకూలిపోయింది కాంతమ్మ. అదే క్షణంలో ఆ ఇంటి వాచ్‌మాన్ ఆ ఆఫీసు వాళ్ళు ఇచ్చారంటూ ఒక కవరు కాంతమ్మ చేతుల్లో పెట్టాడు. వణుకుతున్న చేతులతో ఆ కవరును చించి, ఆత్రంగా ఆ ఉత్తరాన్ని చదవసాగిందామె.

డియర్ కాంతమ్మత్తా!

మీ కంపెనీ అమ్మాయిలందరి పేరా తలా యాభై వేల చొప్పున లక్షలు అప్పనంగా సంపాయించేద్దామనుకున్నావు కదూ.

సారీ! నీలాగే మాకూ ఆశ. అప్పనంగా సంపాదించేయాలని. అందుకనే ఆలోచించి ఈ ప్లాన్ వేశాం. అప్పుల ఆశ చూపించి నీకు గేలం వేశాం. నువ్వు పంపిన జాంపళ్ళలాంటి పిల్లల్ని హాయిగా, ఫ్రీగా, పైసా ఖర్చు లేకుండా అనుభవించాం. అంతే కాదు. వారిని నగ్నంగా ఫోటోలు తీశాం. మా రతి క్రీడల్ని చాటుగా షూట్ చేశాం. ఆ ఫోటోలకు, బ్లూ ఫిల్మ్ క్యాసెట్స్‌కు మార్కెట్‌లో రేటు తెలుసు కదా!


ఏంటీ? లక్షలు కొట్టేశామని తిట్టుకుంటున్నావా? తప్పత్తా!

తాకట్టులేందే ఎవరూ అప్పివ్వరని తెలిసీ, మీ అమ్మాయిల్ని తార్చి, వాళ్ళ అందాలను ఎరచూపి లక్షలు కొట్టేయాలనుకున్నావు నువ్వు. ఆ అందాలనే నీలిచిత్రాలుగా మార్చి సొమ్ము చేసుకున్నాం మేం.

ఇద్దరం దోపిడీ గాళ్ళమేగా! మరి నీ సొత్తేదో పోయినట్టు ఆ ఏడుపెందుకత్తా!

అంతే! ఉత్తరం పూర్తయ్యే సరికి వెర్రిగా అరుస్తూ తెలివి తప్పి పడిపోయింది కాంతమ్మ.

ఆ అమ్మాయిలు ఆమె వంక జాలిగా చూశారు.



తాము ఎంత దారుణంగా మోసపోయారో తెలిశాక కూడా ఆ అభాగినులకు కన్నీళ్ళు రాలేదు. విరక్తిగా, నిర్లిప్తంగా... జాలిగా నవ్వుకున్నారు.

నిజం జాలిగానే!

మగ జాతి మోసానికి బలై, ఈ నరక కూపం లోకి త్రోయబడ్డ క్షణం ఏడ్చారు. మెతుకుకోసం, బ్రతుకు కోసం మరో మార్గం లేక, చీకటిలో ఆ వేశ్యా వాటికలో విటుల కౌగిళ్ళలో కర్కశంగా నలిగి పోతూ ప్రతి రాత్రీ ఏడుస్తూనే ఉన్నారు.

కాని, ఈ పడుపు కూడును కూడా దోచుకునే దొరలున్నారన్న నిజం తెలిసిన క్షణం... వారికి కన్నీళ్ళు రావడం లేదు.

జాలి! జాలి వేసింది -

ఆ మానవ మృగాలపైన.